సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 3 । జనవరి । 2025



సౌకర్యాలు కరువు
వక్ఫ్‌బోర్డు అధికారుల నిర్లక్ష్యం వల్ల జాన్‌పహాడ్ సైదన్న దర్గా అసౌకర్యాల నడుమ కొట్టుమిట్టాడుతోంది.
- 8లో



భిన్న పంటలతో ఆదాయం
నడిగూడెంలో యువ రైతు రామకృష్ణ ఒకే నేలలో, ఒకే సీజన్‌లో భిన్న పంటలను సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నాడు.
- 8లో



దీక్షలు భగ్నం
ఇథనాల్ కంపెనీ అనుమతులు రద్దు చేసే వరకు పోరాటాలు చేస్తామని కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు అన్నారు.
- 10లో

న్యూస్‌రీల్

నేడు, రేపు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

నల్లగొండ : విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో రెండురోజుల పాటు జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడగా.. 3, 4 తేదీల్లో నిర్వహించేందుకు ఖరారు చేశారు. ఇందు కోసం నల్లగొండలోని డాన్‌బోస్కో ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, విశిష్ట అతిథిగా గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరుకానున్నారు.

నేటి నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన

నల్లగొండ టౌన్: జిల్లా వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 5వ తేదీ వరకు నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 8,155 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయని.. అందులో కేవలం 1010 ఇండ్లు మాత్రమే లబ్ధిదారులకు స్వాధీనం చేశారని పేర్కొన్నారు. మిగిలిన ఇళ్లు ఏఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకునేందుకు పరిశీలిస్తామని తెలిపారు. ఇళ్లను పూర్తి చేసి లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

నల్లగొండ అగ్రికల్చర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ కోరారు. గురువారం నల్లగొండలో జరిగిన డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 3, 4 తేదీల్లో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్, ఉపాధ్యక్షుడు గుండాల నరేశ్, జిల్లా సహాయ కార్యదర్శి వడ్డగాని మహేశ్, రఘువరన్, కార్తీక్, రాము తదితరులు పాల్గొన్నారు.

4న లూయిస్ బ్రెయిలీ జయంతి

రామగిరి(నల్లగొండ) : డాక్టర్ లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని 4వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి కేవీ.కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా శాఖ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

కనగల్ : పేదలకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలి.. ఆసుపత్రిలో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

రామగిరి(నల్లగొండ) : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ మహిళలకు 30 రోజుల పాటు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఇ.రఘుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. టెన్త్ అర్హత కలిగి ఉండి 19 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన వారు నల్లగొండ రాంనగర్‌లోని సంస్థ కార్యాలయంలో జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9701009265 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆర్సెనిక్.. ఫ్లోరైడ్.. నైట్రేట్

భూగర్భ జలాల్లో మోతాదుకు మించి రసాయన అవశేషాలు

భూగర్భ జలాల నాణ్యత నివేదిక-2024లో వెల్లడి

- ఉమ్మడి జిల్లాలో ప్రమాదకరంగా భూగర్భ జలాలు
- నీటిలో మూలకాలు మోతాదుకు మించితే తీవ్ర అనారోగ్య సమస్యలు
- నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో అధికంగా ఫ్లోరైడ్, క్లోరైడ్
- సూర్యాపేట జిల్లాలో ఆర్సెనిక్ పరిమాణం అధికం

భూగర్భ జలాల్లో పలు రసాయన అవశేషాలు మోతాదుకు మించి ఉన్నాయని, ఆ నీటిని తాగితే తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని భూగర్భ జలాల నాణ్యత నివేదిక-2024 వెల్లడించింది. ఉమ్మడి జిల్లాలోని రెండు చోట్ల ఆర్సెనిక్ అనే రసాయన అవశేషాలు, ఫ్లోరైడ్, నైట్రేట్ మోతాదుకు మించి ఉన్నట్లుగా పేర్కొంది.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల భూగర్భ జలాలు ప్రమాదకరంగా ఉన్నాయని, ఆ నీటిని తాగితే వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని భూగర్భ జలాల నాణ్యత నివేదికలో వెల్లడైంది. 2023లో నైరుతి రుతుపవనాలు రావడానికి ముందు, అవి వచ్చిన తరువాత వర్షాలు కురిశాక దేశవ్యాప్తంగా రెండుసార్లు భూగర్భ జలాలను కేంద్ర భూగర్భ జల మండలి సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించింది. ఆ పరీక్షల్లో వెల్లడైన అంశాలతో వార్షిక భూగర్భ జలాల నాణ్యత నివేదిక-2024ను విడుదల చేసింది. ఆ నీటిలోని రసాయన అవశేషాలు, వాటి వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించింది. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పరిస్థితులను కూడా అందులో వెల్లడించింది. జిల్లాలోని పలు చోట్ల ఫ్లోరైడ్, క్లోరైడ్, నైట్రేట్‌తోపాటు రెండు చోట్ల ఆర్సెనిక్ అనే రసాయన పదార్థం అవశేషాలు ఉన్నట్లు వెల్లడించింది.

- సాధారణంగా నీటిలో క్లోరైడ్ ప్రతి లీటరు నీటిలో 250 ఎంజీ నుంచి 1000 ఎంజీలోపే ఉండాలి. కానీ యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం నాగారంలో ప్రతి లీటర్ నీటిలో 1158 ఎంజీ క్లోరైడ్ ఉండగా, రామన్నపేటలో 1050 ఎంజీ క్లోరైడ్ ఉన్నట్లు తేల్చింది.



ఆర్సెనిక్‌తో తీవ్ర అనారోగ్యం

సాధారణంగా ఆర్సెనిక్ ప్రతి లీటర్ నీటిలో 0.01 మిల్లీ గ్రాములు (10 మైక్రో గ్రాములు) మాత్రమే ఉండాలి. అయితే ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేటలో 17.7533 మిల్లీ గ్రాములు (ఎంజీ) ఉన్నట్లుగా తేల్చింది. అలాగే కుడకుడలోని భూగర్భ జలాల్లో 19.7215 ఎంజీ ఉన్నట్లుగా వెల్లడించింది. ఆర్సెనిక్‌తో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని కేంద్ర జల సంఘం ఆ నివేదికలో పేర్కొంది. ఆర్సెనికోసిస్ అనే వ్యాధి వస్తుందని తెలిపింది. లంగ్ క్యాన్సర్, డయాబెటీస్, గుండె, రక్త నాళాలు దెబ్బతినడం, చర్మ వ్యాధులు వంటివి వస్తాయని పేర్కొంది.

అధిక ఐరన్‌తోనూ ముప్పే..

తాగునీటిలో ఐరన్ సాధారణం కంటే ఎక్కువగా ఉంటే కూడా అనారోగ్యం బారిన పడతారని పేర్కొంది. ఆ నాటిని తాగితే వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి తదితర అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుందని పేర్కొంది. సాధారణంగా లీటరు నీటిలో 1.0 ఎంజీ మాత్రమే ఐరన్ ఉండాలి. అయితే జిల్లాలోని సూర్యాపేటలో 1.32 ఎంజీ, బోడంగిపర్తిలో 1.19 ఎంజీ, చిన్నపడిశాలలో 1.17 ఎంజీ ఐరన్ మూలకాలు ఉన్నట్లుగా తేలింది.

పరిమితికి మించి ఫ్లోరైడ్

ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ పరిమితికి మించి ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. సాధారణంగా లీటరు నీటిలో ఫ్లోరైడ్ 1.5 ఎంజీ లోపే ఉండాలి. కానీ, పలు ప్రాంతాల్లో 5 ఎంజీకి పైగా, కొన్ని చోట్ల 20 ఎంజీ వరకు ఉన్నట్లు పరీక్షల్లో తేలినట్లు వెల్లడించింది. ఆ నీటిని తాగితే ఫ్లోరోసిస్, ఇతర వ్యాధులు వస్తాయని వివరించింది. ముఖ్యంగా నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లోని భూగర్భ జలాల్లో అత్యధికంగా ఫ్లోరైడ్ ఉన్నట్లు తేలింది. యాదాద్రి జిల్లాలో 43 నీటి నమూనాలుపరీక్షిస్తే 21 నమూనాల్లో ఫ్లోరైడ్ పరిమితికి మించి ఉన్నట్లుగా వెల్లడైంది. అయితే నల్లగొండలో తాగునీటి విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు అందులో పేర్కొంది.

ఫ్లోరైడ్ ప్రతి లీటర్ నీటిలో (మిల్లీ గ్రాముల్లో)

నల్లగొండ జిల్లాలో..

అంతంపేట-2	5.04
అంతంపేట-1	4.28
ఎల్లారెడ్డిగూడెం	3.58
చీకటిగూడెం	3.23
అజిలాపురం	2.68
కురుమపల్లి	2.9
చెన్నంనేనిపల్లి	2.01
వద్దిపట్ల	2.02

పలివెల, అడవితూమలపల్లి, చింతపల్లి, నారమ్మగూడెం, మాసంగి, చీకటిమామిడి గ్రామాల్లో ప్రతి లీటరు నీటిలో 1.5 ఎంజీ నుంచి 2 ఎంజీ వరకు ఫ్లోరైడ్ ఉన్నట్లు తేలింది.

యాదాద్రి జిల్లాలో..

నాగారం	2.2
హసనబాద్	2.89
మల్కాపురం	3.08
మార్టూర్	3.1
మల్లాపురం	3.01
మల్కాపూర్	3.13
మునిపంపుల	2.18
మర్యాల	2.26

జానకిపురం, ఎన్నారం, చందేపల్లి, స్వామివారిలింగోటం, కొరటికల్, వెంకటాపురం, గుజ్జ, రామన్నపేట, వీరవల్లి, ఎం.తుర్కపల్లి గ్రామాల్లో ప్రతి లీటరు నీటిలో 1.5 ఎంజీ నుంచి 2 ఎంజీ వరకు ఫ్లోరైడ్ ఉన్నట్లు తేలింది.

సూర్యాపేట జిల్లాలో..

ఎర్రవరంలో ప్రతి లీటరు నీటిలో 2.09 ఎంజీ ఫ్లోరైడ్ ఉండగా, 1.5 నుంచి 2 ఎంజీ వరకు గుడిబండ, కందగట్ల, బాలెంల, యెర్కారం, కుడ్లి, మోతె, అర్వపల్లిలో ఉంది.

భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించాలి



పంటల్లో ఎక్కువగా రసాయన ఎరువులు వాడొద్దు. వాటిని వాడితే నైట్రేట్ ఎక్కువగా వస్తుంది. భూగర్భంలో ఎక్కువ లోతుకు వెళ్లి నీటిని తీసుకోవద్దు. తద్వారా వాటి ప్రభావాన్ని పరిమితం చేయవచ్చు. రిజర్వాయర్లలో పెద్ద ఎత్తున నీటిని నిల్వ చేస్తే కొంత ఉపయోగం ఉంటుంది. భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించాలి.

– డాక్టర్ జి.మచ్చేందర్, ఎంజీయూ, జియాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్

నైట్రేట్ ప్రతి లీటర్ నీటిలో (మిల్లీ గ్రాముల్లో)

నల్లగొండ జిల్లాలో..

దేవరకొండ	72	చింతపల్లి	52
నకిరేకల్	82	మాడుగులపల్లి	94
నిడమనూరు	97	గాగిల్లపురం	169
చింతపల్లి	49	గోదుమడక	120
చీకటిమామిడి	116	నసర్లపల్లి	77
మంగాపూర్	60	కంబాలపల్లి	163
అంతంపేట	52	కందకూర్	77
అంతపేట-2	253	నాంపల్లి	164
బోడంగిపర్తి	73	అడవితుమ్మలపల్లి	46
సత్యనారాయణపురం	92	వట్టికోడ్	55
కురంపల్లి	123	నాంపల్లి	132
అజిలాపురం	74	ఎల్లారెడ్డిగూడెం	58

సూర్యాపేట జిల్లాలో..

హుజూర్‌నగర్	107	పిల్లలమర్రి	95

యాదాద్రి జిల్లాలో..

పోచంపల్లి	125	కొరటికల్	95
రుస్తాపూర్	85	తూర్పుగూడెం	190
రాజాపేట	61	వంకమామిడి	175
నాగారం	278	స్వామివారిలింగోటం	46
వీరవల్లి	78	చిన్నపడిశాల	46
గౌరాయిపల్లి	55	జానకిపురం	69

అత్యధిక నైట్రేట్‌తో తీవ్ర అనారోగ్య సమస్యలు



జిల్లాలోని పలు ప్రాంతాల్లో నైట్రేట్ ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు తేలింది. సాధారణంగా ప్రతి లీటరు నీటిలో 45 ఎంజీకంటే ఎక్కువ నైట్రేట్ ఉండకూడదు. కానీ జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో మోతాదుకు మించి నైట్రేట్ ఉందని, ఆ నీటిని వాడితే అనారోగ్య సమస్యలు వస్తాయని పేర్కొంది. గర్భ సమస్యలు రావడం, బిడ్డ బరువు తగ్గిపోవడం, ఎర్ర రక్త కణాలు తగ్గిపోవడం, అల్సర్లు, తీవ్ర అనారోగ్య సమస్యలు వంటివి వస్తాయని పేర్కొంది. ఉమ్మడి జిల్లాలోని 38 ప్రాంతాల్లో నైట్రేట్ మోతాదుకు మించి ఉండగా, దాదాపు 15 ప్రాంతాల్లో పరిమితి కంటే రెట్టింపు నైట్రేట్ నీటిలో ఉన్నట్లు తేలింది.

ఇంటింటికీ యూజీడీ కనెక్షన్

- నేరుగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలోకి వెళ్లనున్న మురుగు
- నీలగిరిలో తీరనున్న సమస్య
- తగ్గనున్న దోమల బెడద



ఇంటి నుంచి ఇచ్చిన యూజీడీ కనెక్షన్

నల్లగొండ టూటౌన్: నీలగిరి పట్టణంలో అమృత్-2.0 పథకంలో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రతి ఇంటి నుంచి మురుగు నేరుగా యూజీడీ పైప్‌లైన్‌కి చేరుకునే విధంగా చాంబర్ నిర్మించి కనెక్షన్ ఇస్తున్నారు. ఈ విధానంతో ఇకనుంచి మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో ఓపెన్ డ్రెయినేజీల్లో మురుగు కనిపించే అవకాశం ఉండదు. తద్వారా డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పడి మురుగు నీరు నిలిచే ప్రక్రియకు చెక్ పడనుంది. గతంలో ఉన్న ఓపెన్ డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పడితే మురుగు నిలిచిపోయి రోడ్డుమీద పారేది. ఇప్పుడు యూజీడీ నిర్మాణంతో వీధుల్లో మురుగు సమస్య తీరనుంది.

యూజీడీ పనుల వివరాలు

పథకం	అమృత్-2.0
కేటాయించిన నిధులు	రూ.216కోట్లు
డ్రెయినేజీల పొడవు	185 కి.మీ
ఇప్పటి వరకు పూర్తిచేసిన కిలోమీటర్లు	45
పనులు సాగుతున్న వార్డులు	15
పూర్తి చేయాల్సిన గడువు	2026 మార్చి

పూర్తిగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైప్‌లైన్ వేయడం ద్వారా దోమల బెడదకు చెక్ పడనుంది. అయితే 2026 మార్చి వరకు గడువు ఉన్నందున ఆ సమయానికంటే ముందుగానే పనులు పూర్తి చేయాలని మున్సిపల్ యంత్రాంగం భావిస్తోంది.

దోమల బెడదకు చెక్..

మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో ఓపెన్ డ్రెయినేజీల్లో మురుగు నీరు నిలిచి దోమల ఉధృతి పెరుగుతోంది. ప్రతి ఇంటికీ నేరుగా చాంబర్ ద్వారా ఇస్తున్న యూజీడీ కనెక్షన్ వల్ల ఇకనుంచి దోమల పెరుగుదల గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఓపెన్ డ్రెయినేజీల వల్ల మురుగు నీరు నిలిచి దోమలతో విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలేవి.

పనులు వేగవంతమయ్యాయి



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 45 కిలోమీటర్ల మేర పూర్తి చేశాం. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పూర్తయిన చోట్లలో సీసీ రోడ్ల నిర్మాణం కూడా పూర్తి చేస్తున్నాం.

– బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, నల్లగొండ

అన్నిరంగాల్లో జిల్లా ముందంజ

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : జిల్లా అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉందని.. ఇందుకు జిల్లాలో సమర్థవంతులైన, బాధ్యత కలిగిన అధికారులు, సిబ్బంది ఉండడం వల్లేనని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సమగ్ర కుటుంబ సర్వే వంటి అంశాలలో జిల్లా మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేసిన మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, జిల్లా అధికారులను గురువారం ఆమె కలెక్టరేట్‌లో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదే వరవడిని కొనసాగించాలని కోరారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో ఏర్పాటు చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం పూర్తి బాధ్యతతో పనిచేస్తుందన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి అమరేందర్, ఆర్డీఓలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు శ్రీనివాస్ మాట్లాడారు. గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. రూ.7000 విలువ చేసే బెడ్‌షీట్లను వారు కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎండీ.మునిబుద్దీన్, బాలరాజురెడ్డి, అమరేందర్‌గౌడ్, సందీప్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్ పాల్గొన్నారు.

టెట్ పరీక్ష కేంద్రం తనిఖీ

టెట్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తనిఖీ చేశారు. నల్లగొండలోని ఎస్పీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సందర్శించిన ఆమె అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రానికి 180 మంది అభ్యర్థులను కేటాయించగా, ఉదయం పరీక్షకు 118 మంది హాజరైనట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మొదటి రోజు కలెక్టర్ వెంట డీఈఓ భిక్షపతి తదితరులు ఉన్నారు.



తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

విద్యార్థినులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కనగల్ : విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. గురువారం కనగల్‌లోని కస్తూరాబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా వారికి నోట్‌బుక్స్, పెన్నులు, చాక్లెట్లను పంపిణీ చేశారు. పాఠశాలతో పాటు, పరిసరాలను, వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని.. భోజనం నాణ్యతగా ఉండాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ పద్మ, ఎంపీఓ సుమలత, ఎంఈఓ పద్మ తదితరులు ఉన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పక్కన ఏఎస్పీ రాములునాయక్

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం వివిధ శాఖల అధికారులతో ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్-11లో ఆయన మాట్లాడారు. బాల కార్మికులు కనిపిస్తే 1098, డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని కోరారు. నిరాదరణకు గురైన, తప్పిపోయిన, వెట్టి చాకిరీకి గురవుతున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జనవరి నుంచి ఈనెల 31వ తేదీ వరకు పోలీస్, స్త్రీ శిశు సంక్షేమ, కార్మిక, విద్యా, ఆరోగ్యశాఖ, బాలల ప్రొటెక్షన్ అధికారుల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా మూడు సబ్ డివిజన్ల పరిధిలో తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కౌన్సిలింగ్ ఇచ్చి విముక్తి కల్పిస్తామన్నారు. బాలల హక్కులకు ఆటంకం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, అరుణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సు పోస్టులకు దరఖాస్తులు

నల్లగొండ టౌన్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ పాలియేటీవ్ కేర్ విభాగంలో ఖాళీగా ఉన్న నాలుగు స్టాఫ్ నర్స్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయడానికి ఎంఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు సాయంత్రం 5 గంటలలోగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రూ.200 రుసుముతో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఎండీ.యూసూఫ్ ఫోన్ నంబర్ (9052813786)ను సంప్రదించాలని సూచించారు.

ఆలయాలకు పాలకమండళ్లు



రామగిరి(నల్లగొండ) : దేవాలయాలకు పాలకమండళ్లు (ట్రస్ట్ సభ్యుల) ఏర్పాటవుతున్నాయి. జిల్లాలోని ఆలయ పాలకమండళ్ల నియామకానికి దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ గతంలోనే నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లాల్లోని 80 దేవాలయాలకు ధర్మకర్తల మండలి ఎంపిక కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. అయితే.. జిల్లాలోని ఆలయాలను 6ఏ, 6బీ, 6సీ కేటగిరీలుగా విభజించారు. కమిటీల స్థాయిని బట్టి 6బీ, 6సీ ఆలయాలకు ధర్మకర్త పదవుల ఎంపిక ఏకగ్రీవంగా జరపాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆసక్తి గల వారు అసిస్టెంట్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారి గురించి శాఖాపరమైన విచారణ చేపట్టాకే కమిటీల నియామకం జరగనుంది. ఇప్పటి వరకు 38 ఆలయాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అందులోని కొన్ని ఆలయాల్లో పాలక మండలి నియామకం పూర్తి కాగా మరికొన్నింటి ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలోనే అన్ని కమిటీలను నియామకం పూర్తికానుంది.

నియామకాలు పూర్తి చేస్తాం



ఆలయాల్లో పాలకమండళ్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. అర్హత ఉన్న ఆలయాలను గుర్తించి నోటిఫికేషన్ జారీ చేశాం. అందులో ఇప్పటికే కొన్ని ఆలయాల్లో కొత్త కమిటీలు పూర్తి కాగా మరి కొన్ని చోట్ల పూర్తి చేసేందుకు శాఖాపరమైన కసరత్తు సాగుతోంది.

– కె.భాస్కర్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

క్లుప్తంగా

బాబాసాహెబ్‌గూడెం వాసికి డాక్టరేట్


జానారెడ్డి

కనగల్ : మండల పరిధిలోని బాబాసాహెబ్‌గూడెంకు చెందిన సుంకిరెడ్డి మాధవరెడ్డి –వెంకటమ్మ కుమారుడు జానారెడ్డికి గురువారం తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. ఆ యూనివర్సిటీ గణిత శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో గణిత శాస్త్రంలో నాన్ న్యూటోనియన్ ఫ్లూయిడ్ ఫ్లో ప్రాబ్లమ్స్ ఓవర్ ఎ స్ట్రెచింగ్ షీట్ ఇన్ ప్రజెన్స్ ఆఫ్ మాగ్నటిక్ ఫీల్డ్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను జానారెడ్డికి డాక్టరేట్ పట్టా అందజేసింది. జానారెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

4న సైక్లింగ్, టగ్ ఆఫ్ వార్ పోటీలు

మునగాల: ఉమ్మడి నల్లగొండ జిల్లా పాఠశాల క్రీడల్లో భాగంగా 17 సంవత్సరాల లోపు బాలబాలికలకు అండర్–14 సైక్లింగ్, టగ్ ఆఫ్ వార్ పోటీలను ఈ నెల 4వ తేదీన సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ.ఆజాంబాబా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు 4వ తేదీ ఉదయం 9గంటల లోపు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జారీ చేసిన బోనఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు.

పోలీస్ బందోబస్తు నడుమ అంత్యక్రియలు


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

చివ్వెంల(సూర్యాపేట) : భూ తగాదాల కారణంగా హత్యకు గురైన చివ్వెంల మండల పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన ధరావతు శేషు అంత్యక్రియలు పోలీసుల బందోబస్త్ మధ్య గురువారం నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కేసులో ఇప్పటికే ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్ (ఎస్), అర్వపల్లి ఎస్‌ఐలతోపాటు, కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొన్నారు.

లైన్‌మెన్‌పై కేసు నమోదు

కనగల్ : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా దర్వేశిపురం వంతెన వద్ద ఒడిషాకు చెందిన వలస కూలీ మృతి చెందాడని, దానికి సంబంధించిన లైన్‌మెన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి గురువారం తెలిపారు. ఎల్‌టీ లైన్ తెగి కిందపడి ప్రమాదకరంగా ఉందని సంబంధిత రైతులు లైన్‌మెన్ వెంకటనర్సింహారెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకుపోయినా పట్టించుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒకరి మృతికి కారణమైనందున లైన్‌మెన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

'సైదన్న' సన్నిధిలో సౌకర్యాలు కరువు

- జాన్‌పహాడ్ దర్గాకు నాలుగు శతాబ్దాల చరిత్ర
- ఆదాయం ఉన్నా.. వసతులు శూన్యం
- ఈ నెల 23 నుంచి ఉర్సు ప్రారంభం


జాన్‌పహాడ్ దర్గా


శిథిలావస్థలో వసతి గృహాలు


మరమ్మతులకు నోచుకోని సఫాయిబావి

పాలకవీడు: వక్ఫ్‌బోర్డు అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ ×సైదన్న దర్గా₹. నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ దర్గా అసౌకర్యాల నడుమ కొట్టుమిట్టాడుతోంది. ఈ దర్గా ద్వారా సంవత్సరానికి సుమారు రెండు కోట్ల ఆదాయం వక్ఫ్‌బోర్డుకు సమకూరుతోంది. అయినా ఇక్కడ సౌకర్యాలు కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోంది.

ప్రతి శుక్రవారం భక్తుల తాకిడి..

జాన్‌పహాడ్ దర్గాకు ప్రతి శుక్రవారం భక్తులు కందూరు పేరుతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. వీరి వద్ద నుంచి యాటపోతులు, కోళ్లకు హలాల్ చేయడం, దేవుడికి పహేతాలు సమర్పించడం, జెండాలు, దట్టీలు, కొబ్బరికాయలు, వాహన పూజలు, లడ్డూ తదితర వాటిపై వక్ఫ్‌బోర్డుకు ఆదాయం సమకూరుతోంది. ప్రతీ సంవత్సరం జనవరి నెలలో మూడు రోజుల పాటు నిర్వహించే ఉర్సుకు లక్షల్లో భక్తులు దర్గాను దర్శించుకుంటారు. 1984 తరువాత దర్గా వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి వెళ్లిన నాటి నుంచి నేటి వరకు సుమారు రూ.20 కోట్ల వరకు బోర్డుకు ఆదాయం సమకూరినట్లు సమాచారం.

మూడు రోజులపాటు ఉర్సు

జనవరి 23, 24,25 తేదీల్లో దర్గా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అయినప్పటికీ దర్గా వద్ద ఇంత వరకు సౌకర్యాలపై వక్ఫ్‌బోర్డు అధికారులు దృష్టి సారించలేదు. వక్ఫ్‌బోర్డు అధికారులు శాశ్వత ప్రాతిపదికన దర్గా వద్ద మౌలిక వసతులు సమకూర్చాలని భక్తులు కోరుకుంటున్నారు.

దర్గా పరిసరాల్లో ఆక్రమణలు

దర్గా పరిసర ప్రాంతంలో అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. వాహన పూజలు, కందూరు ఊరేగింపులు, ప్రదక్షిణలలో దర్గా ప్రాంగణం ఇరుకుగా మారింది. ఆక్రమణలను తొలగించాలని భక్తులు, స్థానికులు వక్ఫ్‌బోర్డు అధికారులను కోరడంతో కొద్ది నెలల క్రితం దుకాణాలు స్వచ్ఛందంగా తొలగించాలని ఆక్రమణదారులకు బోర్డు ఇన్‌స్పెక్టర్ నోటీసులు అందించారు. మరోమారు నోటీసులు అందజేసి ఆక్రమణలు తొలగిస్తామని బోర్డు అధికారులు తెలిపారు.

దర్గా అభివృద్ధికి రూ.85లక్షల నిధులు

జాన్‌పహాడ్ 'దర్గా'వద్ద మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధికి రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.85 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నెలలో నిర్వహించే ఉర్సు ఉత్సవాల ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈ పనులను మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బుజ్జిమోతీలాల్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌వి.సుబ్బారావు గురువారం ప్రారంభించారు.

డెక్కన్ సిమెంట్ పరిశ్రమ సహకారం..

పది సంవత్సరాలుగా డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వారు దర్గా వద్ద సీసీరోడ్లు, నీటి వసతి, బోర్లు, డ్రెయినేజీల నిర్మాణం తదితర అవసరాలను తీర్చింది. ప్రభుత్వాలు గానీ వక్ఫ్‌బోర్డు ద్వారా గానీ దర్గా వద్ద ఎలాంటి అభివృద్ధి పనుల చేపట్టలేదు.

ప్రభుత్వ పెద్దలు హామీలు ఇస్తున్నా..

ప్రతి సంవత్సరం భారీస్థాయిలో నిర్వహించే ఉర్సుకు రాష్ట్ర మంత్రులు హాజరవుతారు. ఆ సమయంలో దర్గా అభివృద్ధికి హామీలు ఇస్తున్నారే తప్ప అమలుకు నోచుకోవడంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి హోం మంత్రి మహమూద్ అలీ, అప్పటి విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి దర్గాను దర్శించుకుని దర్గాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గత ఎమ్మెల్యే సైదిరెడ్డి సైతం రూ.50 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కానీ నిధులు మంజూరు చేయలేదు. ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా కొనసాగుతున్నారు. దర్గా అభివృద్ధికి ఆయనపై కృషి చేస్తారని భక్తులు నమ్మకంతో ఉన్నారు.

దర్గా వద్ద తక్షణ అవసరాలు..

భక్తులు కందూరు, ఉత్సవాల సందర్భంగా బస చేయడానికి కాటేజీలు నిర్మించాలి. స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలి. సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి. పారిశుద్ధ్య కార్మికులను నియమించాలి. విద్యుత్ వ్యవస్థను ఆధునీకరించాలి. దర్గా పరిసరాల్లో నీటిశుద్ధి ప్లాంటు ఏర్పాటు చేయాలి. దర్గా పరిసరాల్లో ట్రాఫిక్ కష్టాలను తీర్చాలి. దర్గా చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మించాలి.

శిథిలమవుతున్న కాటేజీలు, స్నానపు గదులు..


శిథిలమైన స్నానపు గదులు

ప్రతి శుక్రవారం మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు ఒక రోజు ముందుగానే దర్గా వద్దకు చేరుకుంటారు. రాత్రి సమయంలో బస చేయాలంటే కనీస వసతి లేక అవస్థలు పడుతున్నారు. వంద సంవత్సరాల క్రితం ఇక్కడ దాతలతో నిర్మించిన సత్రాలు ప్రస్తుతం కూలిపోయి శిథిలావస్థకు చేరాయి. స్నానాలు చేయాలంటే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు శిథిలమయ్యాయి. ఆరుబయట మలమూత్ర విసర్జనతో దర్గా పరిసరాలు దుర్వాసనతో కంపుకొడుతున్నాయి. ముఖ్యంగా మహిళలు చీరలు అడ్డుగా కట్టుకుని స్నానం చేయడం కలచివేస్తోంది. వంటావార్పునకు అష్టకష్టాలు పడాల్సిందే.

దుస్తులు మార్చుకునేందుకు ఇబ్బందిగా ఉంది



దర్గాకు నా చిన్నతనం నుంచి వస్తున్నా. మాది మాచర్ల. అప్పుడు ఎలా ఉందో ఇప్పుడు అలాగే ఉంది. ఎలాంటి అభివృద్ధి జరగలేదు. ఏళ్ల క్రితం కట్టించిన వసతి గృహాలు కావడంతో అవి పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. స్నానపు గదులు లేక ఆరు బయట స్నానాలు చేయాల్సి వస్తోంది. దుస్తులు మార్చుకునేందుకు ఇబ్బందిగా ఉంది. మహిళలు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు.

– శైలజ, మాచర్ల, ఆంధ్రప్రదేశ్

ఉన్నతాధికారులకు నివేదించాం



దర్గా వద్ద భక్తులకు ఇబ్బందులు ఉన్నమాట వాస్తవమే. ఉర్సు వరకు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. శాశ్వత వసతుల కల్పనకు, దర్గా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– మహమూద్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

మహిళలపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన చాంద్‌బీ (ఫైల్)

కనగల్ : మండల పరిధిలోని ఇస్లాంనగర్ గ్రామంలో ఇరువురు మహిళలపైకి ట్రాక్టర్ దూసుకెళ్లిన సంఘటనలో ఒకరు మృత్యువాత పడగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ పి.విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ చాంద్‌బీ (54) షేక్ లాల్‌బీ గ్రామంలో మసీదుకు వెళ్లే మూలవద్ద కూర్చొని ఉండగా అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ మెయిన్ రోడ్డు నుంచి గ్రామానికి వస్తూ వీరి మీదుగా దూసుకెళ్లింది. 108 వాహనంలో వారిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చాంద్ బీ మృతి చెందింది. లాల్‌బీ ని వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతురాలి కుమారుడు షేక్ బడే మియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య

పెద్దఅడిశర్లపల్లి : అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుడిపల్లి మండలంలో గురువారం చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి మండలంలోని చిల్కమర్రి గ్రామానికి చెందిన ఆదాసు గోవర్ధన్(27)ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. గోవర్ధన్ కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో డిసెంబర్ 31వ తేదీన సాయంత్రం గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. అనంతరం ఇంటికి వచ్చి ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగానని తన భార్య మానసతో చెప్పాడు. చికిత్స నిమిత్తం గోవర్ధన్‌ను ఆమె వెంటనే దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీసులు అకారణంగా కొట్టారని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న కాటూరి రాము, బంధువులు

నూతనకల్ : తనను పోలీసులు అకారణంగా కొట్టారని ఆరోపిస్తూ మండల కేంద్రానికి చెందిన కాటూరి రాము తమ బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి నూతనకల్ పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఇంటి ముందు నిల్చున్న వ్యక్తిని పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టడానికి గల కారణం ఏంటని ప్రశ్నించారు. రామును చితకబాదిన ఎస్‌ఐతోపాటు సిబ్బందిని సస్పెండ్ చేసి బాధితుడికి న్యాయం చేయాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ధర్నా విషయం తెలుసుకుని స్టేషన్‌కు చేరుకున్న సీఐ శ్రీనివాస్ నాయక్.. బాధితుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సంఘటనపై పూర్తిస్థాయి విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

వేములపల్లి(మాడ్గులపల్లి) : గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన మాడ్గులపల్లి మండలంలోని పెద్దదేవులపల్లి రిజర్వాయర్ వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దదేవులపల్లి రిజర్వాయర్ అవుట్‌ఫాల్ వద్ద 25 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని మహిళ మృతదేహం కొట్టుకుని వచ్చినట్లు వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతిచెందిన మహిళ మెరూన్ కలర్ టాప్, రెడ్ కలర్ లెగ్గిన్ దుస్తులు ధరించి ఉంది. నీళ్లలో పడి మృతి చెంది రెండు మూడు రోజులు అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మహిళ మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు 8712670192, 8712670151 నంబర్లను సంప్రదించాలన్నారు.

గల్లంతైన యువ ఇంజనీర్ మృతదేహం లభ్యం

మిర్యాలగూడ టౌన్ : సాగర్ ఎడమ కాల్వలో గల్లంతైన ఒక యువ ఇంజనీర్ మృతదేహం గురువారం లభ్యమైంది. మిర్యాలగూడ రూరల్ –2 ఎస్‌ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణం రవీంద్రనగర్‌లో నివాసం ఉంటూ దామరచర్ల మండలం తాళ్ల వీరప్పగూడెం గ్రామ శివారులో గల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటులో ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు యువ ఇంజనీర్లు ఐలాపురం గ్రామ శివారులో గల ఎడమ కాలువలో గల్లంతైన విషయం తెలిసిందే. జనవరి 1వ తేదీన ఎడమ కాలువలో గల్లంతైన ఇద్దరిలో విజయ్ గోస్వామి మృతదేహం గరిడేపల్లి మండలం పొనుగోడు రిజర్వేయర్‌లో లభ్యమైంది. మరో వ్యక్తి కార్తీక్ మిశ్ర ఆచూకీ మాత్రం దొరకలేదు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి భద్రపరిచినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గోవులను తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

చౌటుప్పల్ : అక్రమంగా గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను గురువారం చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఒడిషా రాష్ట్రం నుంచి ఓ కంటైనర్‌లో 86 గోవులను హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో తెల్లవారుజామున జాతీయ రహదారిపై తంగడపల్లి చౌరస్తా వద్ద విధుల్లో ఉన్న పోలీసులు లారీని అనుమానంతో పట్టుకున్నారు. లోపలి భాగంలో పరిశీలించగా గోవులు ఉండడంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. గోవులను గోశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: రోడ్డు పక్కన నిలబడిన మహిళలను గుర్తుతెలియని ఆటో ఢీకొట్టింది. ఈ సంఘటన చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం గ్రామ పరిధిలో గల ఆందోళ్‌మైసమ్మ గుడి వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన దూపం సారమ్మ, మోతె జంగమ్మ ఆందోళ్ మైసమ్మ ఆలయానికి వచ్చారు. తిరిగి అబ్దుల్లాపూర్‌మెట్‌కు వెళ్లడానికి బస్సు కోసం ఎదురు చూస్తుండగా గుర్తుతెలియని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దూపం సారమ్మ కుమారుడు ఏసురత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

మునగాల: మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి పలు వీధుల్లో అల్లరి చేస్తూ పలువురికి ఇబ్బంది కలిగించిన ఐదుగురు యువకులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మునగాల మండల కేంద్రానికి చెందిన మానుపాటి గోపి, తురక మధు, బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన షేక్ సాదిక్, మందుల దినేష్, మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన పాల్వాయి విద్యాసాగర్ వీధుల్లో తిరుగుతూ పలు ఇళ్ల ఎదుట వేసిన ముగ్గులను చెరిపివేయడమే కాకుండా ఇంటి ముందు ఉన్న లైట్లను పగులగొట్టారు. వీరిపై మండల కేంద్రానికి చెందిన చిత్తలూరి సీతారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వల్లోజు వెంకన్న, అర్వపల్లి ప్రవీణ్, చెక్కా కిశోర్, బ్రహ్మదేవర అఖిల్, అద్దంకి రామారావుల ఇంటి ముందు వేసిన ముగ్గులను ఈ ఐదుగురు వ్యక్తులు చెరిపివేయడమే కాక ఫ్లెక్సీలను చింపివేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం..

చౌటుప్పల్ : దుకాణంలో పని ముగించుకుని ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు ఇంటికి వెళ్లకుండా అదృశ్యమయ్యాడు. ఈ విషయమై గురువారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ మన్మథకుమార్ తెలిపారు. వివరాలు.. చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన మలిగె శంకర్ స్థానికంగా ఉన్న మున్నా చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. గత నెల 30న పని ముగిశాక దుకాణంలో చెప్పి ఇంటికి బయలుదేరాడు. కానీ ఇంటికి మాత్రం వెళ్లలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నం చేసినప్పటికీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. అతడి భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

కూలి పనికి వెళ్తున్నానని చెప్పి..

కూలి పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఈ విషయమై గురువారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ మన్మథకుమార్ తెలిపారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని పద్మశాలికాలనీలో నివాసం ఉండే ఎండీ.మున్నా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగా గత నెల 31న పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. మున్నా భార్య పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

భిన్న పంటలతో నిత్యాదాయం


రామకృష్ణ సాగు చేసిన బంతిపూల తోట


టమాట తోట

- ఒకే సీజన్‌లో పలు రకాల పంటలు సాగు
- పూలు, కూరగాయల సాగుతో నిత్యం రాబడి
- ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతు రామకృష్ణ

పాడిపంట

నడిగూడెం : సాధారణంగా నీటి సౌకర్యం ఉంటే రైతులు వరి పంట సాగు చేస్తుంటారు. కానీ అందుకు భిన్నంగా ఆ యువ రైతు వరి పంటకు బదులుగా ఒకే నేలలో, ఒకే సీజన్‌లో భిన్న పంటలను సాగుచేస్తూ, నిత్యం ఆదాయం పొందుతున్నాడు. నడిగూడెం మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన రామకృష్ణ తనకున్న అవగాహన మేరకు పలు రకాల పంటల తక్కువ పెట్టుబడులతో సాగు చేస్తూ నిత్యం ఆదాయం పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

కూరగాయలు, బంతి పూల సాగు

నడిగూడెం మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన రామకృష్ణకు నడిగూడెం నుంచి కాగితరామచంద్రాపురంకు వెళ్లే రహదారిలో రెండు ఎకరాల సాగు భూమి ఉంది. దీనికి బోరు నీటి సౌకర్యం కూడా ఉంది. ఈ భూమిలో రామకృష్ణ గత రెండు సీజన్‌లుగా ప్రయోగాత్మకంగా పలు రకాల మెట్ట పంటలను సాగు చేస్తున్నాడు. గత సీజన్‌లో తనకున్న రెండు ఎకరాల భూమిని నాలుగు భాగాలుగా చేశాడు. ఆ నాలుగు భాగాల్లో పచ్చి మిర్చి, టమాట, సాగు చేశాడు. ఫెన్సింగ్‌కు తీగ జాతి పంట అయిన కాకర సాగు చేపట్టాడు. దీంతో ఈ మూడు పంటలపై నిత్యం ఆదాయం పొందాడు. అలాగే ప్రస్తుత సీజన్‌లో బంతి పూలకు మంచి డిమాండ్ ఉంది. దీంతో ఎరుపు, పసుపు బంతి పూల సాగు చేపట్టాడు. మునగాల మండలం తాడ్వాయి వద్ద బంతి నారు తీసుకొచ్చి సాగు చేపట్టాడు. అలాగే వంగ, టమాట, కాకర, దోసకాయ పంటలు కూడా సాగు చేపట్టాడు. తక్కువ పెట్టుబడితో నిత్యం ఆదాయం పొందుతున్నాడు.

స్థానిక మార్కెట్‌లోనే విక్రయం

రామకృష్ణ పండించిన బంతి పూలను చుట్టుపక్కల గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు కొనుగోలు చేస్తున్నారు. అలాగే వంగ, టమాట, పచ్చి మిర్చి, కాకర, దోస వంటి కూరగాయలను నడిగూడెం మార్కెట్‌లోనే విక్రయిస్తున్నాడు. నడిగూడెం, బృందావనపురం గ్రామాలతోపాటు నడిగూడెం నుంచి కాగితరామచంద్రాపురం, నారాయణపురం, కరివిరాల, సిరిపురం గ్రామాలకు వెళ్లే ప్రజలు నేరుగా ఆయన తోటలోనే కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. ఉన్న రెండు ఎకరాల్లో ఇలాంటి విభిన్న పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుసున్నాడు రామకృష్ణ. పెట్టుబడులు పోను సంవత్సరానికి రూ1.50 లక్షల ఆదాయం వస్తోందని రైతు రామకృష్ణ చెబుతున్నాడు.


కాకర తోట


సాగులో ఉన్న వంగ తోట


దోస చేను

ప్రభుత్వం రాయితీ ఇచ్చి ప్రోత్సహించాలి



గత రెండు సీజన్‌లుగా నాకున్న రెండు ఎకరాల్లో కూరగాయలు, బంతి సాగు చేస్తూ నిత్యం ఆదాయం పొందుతున్నా. మాలాంటి రైతులకు ప్రభుత్వం నుంచి డ్రిప్‌ను రాయితీపై ఇవ్వాలి. అలాగే కూరగాయల విత్తనాలు, ఎరువులు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తే బాగుంటుంది.

– గుండెబోయిన రామకృష్ణ, రైతు నడిగూడెం